సాక్షి సూర్యాపేట

మంగళవారం। 21। మే। 2024



అన్నీ స్కాములే..
కాంగ్రెస్ హయాంలో అన్నీ స్కాములేనని మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆరోపించారు. - 8లో



నెల్లిబండ గట్టు జాతర ప్రారంభం
నకిరేకల్ మండలం నెల్లిబండలో శ్రీలింగమంతుల స్వామి, సొడమ్మ జాతర సోమవారం ప్రారంభమైంది. - 8లో

గరిష్టం/కనిష్టం
39°/ 28°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇక టీఎస్‌కు బదులు టీజీ

- కలెక్టర్ వెంకటరావు

భానుపురి (సూర్యాపేట) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇకపై టీఎస్‌కు బదులుగా టీజీని అధికారికంగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏజెన్సీలు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, ప్రభుత్వ సంస్థలు, అధికారిక పత్రాలు (లెటర్ హెడ్, రిపోర్టు, నోటిఫికే షన్ ఇతరత్రా), ప్రభుత్వ కార్యాలయాలు, వెబ్ సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్ఫామ్ ఇతర అధికారిక సంప్రదింపుల్లో టీజీ అని తక్షణమే అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ప్రధాన అధికారిక కమ్యూనికేషన్ అంతర్గతంగా, బహిర్గతంగా టీజీ అని ఉపయోగించాలని, టీజీగా నవీకరించి ప్రచురించిన సామగ్రిని వినియోగించాలని కలెక్టర్ సూచించారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేటటౌన్ : బాధితులకు సత్వర న్యాయం చేయాలి ఎస్పీ రాహుల్ హెగ్డే పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించి మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉండాలని సూచించారు. భూముల సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని, దాడులు చేసుకోవద్దని కోరారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టెట్ ప్రారంభం

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సోమవారం ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, కోదాడలోని సన ఇంజనీరింగ్ కళాశాలలో సెంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటల నుంచి 11.30గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30గంటల వరకు మ్యాథ్స్, సైన్స్ పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌లో ఉదయం జరిగిన పరీక్షకు 210 మందికి 157 మంది హాజరు కాగా 53మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 210 మందికి 192 మంది హాజరు కాగా 18 మంది గైర్హాజరయ్యారు. కోదాడ సన ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం జరిగిన పరీక్షకు 80 మందికి 59 మంది హాజరు కాగా 21 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 80 మందికి ఏడుగురు గైర్హాజరు కాగా 73 మంది హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల సెంటర్‌ను అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీఈఓ అశోక్ పరిశీలించారు.

బెస్ట్ అవైలబుల్ పథకం కింద 31 సీట్లు

భానుపురి (సూర్యాపేట) : జిల్లాకు 2024-25 విద్యా సంవత్సరంలో బెస్ట్ అవైలబుల్ పథకం కింద 31 సీట్లు మంజూరు చేసినట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె. శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతికి 16 సీట్లు, 5వ తరగతికి 8 సీట్లు, 8వ తరగతికి 7 సీట్లు కేటాయించినట్లు వివరించారు. జిల్లాలోని గిరిజన తెగలకు చెందిన లంబాడ, ఎరుకల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 6వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఈనెల 21వ తేదీ నుంచి జూన్ 6వ తేదీ వరకు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో ఉచితంగా ఫారాలు పొంది ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల బోనఫైడ్, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, పాస్ పోర్ట్‌సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నేడు హుజూర్‌నగర్‌కు కేటీఆర్ రాక

హుజూర్‌నగర్ : వరంగల్-ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో హుజూర్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించే సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హాజరుకానున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఒంటెద్దు నరసింహారెడ్డి వెల్లడించారు. సోమవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి కూడా వస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సైదిరెడ్డి, నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, అమర్, శ్రీహరి, పిచ్చయ్య, కృష్ణ, కోట తదితరులు పాల్గొన్నారు.

- నృసింహుడి జయంత్యుత్సవాలు



యాదాద్రి క్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంత్యుత్సవాలను సోమవారం ఉదయం ప్రారంభిస్తున్న అర్చకులు



రాత్రి పరవాసుదేవుడి అలంకారంలో ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతున్న శ్రీస్వామివారు

పోలింగ్‌కు వారమే..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు చకచకా ఏర్పాట్లు

- ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ పూర్తి
- బీఎల్‌ఓల ద్వారా పోల్ చిట్టీల పంపిణీ
- కలెక్టరేట్ నుంచి సమన్వయం చేస్తున్న రిటర్నింగ్ అధికారి హరిచందన

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నల్లగొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్‌కు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. ఈ నెల 27వ తేదీన పోలింగ్ జరగనుంది. అందుకు ఇంకా వారం సమయం మాత్రమే ఉండడంతో అధికారులంతా పోలింగ్ ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, జంబో పోలింగ్ బాక్సులు సమకూర్చడం, బ్యాలెట్ పేపర్ల ముద్రణ పనులు చేపడుతున్నారు. ఈ ఎన్నికకు నల్లగొండ కలెక్టర్ హరిచందన రిటర్నింగ్ అధికారి కావడంతో మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఏర్పాట్లను ఆమె ఇక్కడి నుంచే సమన్వయం చేస్తున్నారు.

అధికారులు, సిబ్బందికి శిక్షణ..
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి సోమవారం పోలింగ్ సిబ్బందికి నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కాలేజీలో మొదటి విడత శిక్షణ పూర్తి చేశారు. ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కూడా శిక్షణ పూర్తయింది. అదే విధంగా కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో కలెక్టర్ హరిచందన ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కాలేజీలో సోమవారం ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు.



నల్లగొండలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

జంబో బ్యాలెట్ బాక్సులు సిద్ధం
ఈ ఎన్నికల్లో 52 మంది పోటీలో ఉన్నారు. దీంతో పెద్ద బ్యాలెట్ పేపర్లు ముద్రిస్తున్నారు. ఇందుకోసం జంబో బ్యాలెట్ బాక్సులను ఉపయోగిస్తున్నారు. ఇప్పటికే ఆయా జిల్లాల అవసరం మేరకు జంబో బ్యాలెట్ బాక్సులు సమకూర్చారు. పోలింగ్ ముందు రోజు పోలింగ్ కేంద్రాలకు జంబో బ్యాలెట్ బాక్సులను ఏ విధంగా తీసుకెళ్లాలో వివరించేలా సోమవారం కలెక్టరేట్‌లో ట్రయల్ రన్ నిర్వహించారు. ఆ బ్యాలెట్ బాక్సులు తీసుకెళ్లేలా బస్సుల లోపలి భాగాన్ని మార్పులు చేస్తున్నారు. ఇప్పటికే పోల్‌చిట్టీల పంపిణీ కొనసాగుతోంది. బీఎల్‌ఓలు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి పోల్ చిట్టీలు అందజేస్తున్నారు.

పోలింగ్, కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేయాలి

నల్లగొండ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్, కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేయాలని నల్లగొండకలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 24వ తేదీన పీఓ, ఏపీఓ, సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఇవ్వాలని ఆ రోజునే ర్యాండమైజేషన్ చేయాలని పేర్కొన్నారు. జూన్ 5 వ తేదీ ఉదయం 8 గంటలకు ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, లెక్కింపునకు హాజరయ్యే సిబ్బందికి కూడా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రథమ చికిత్స కిట్లు, దివ్యాంగులకు వాహనాలు, వీల్ చైర్లు కల్పించాలన్నారు.

'ఇంటర్ అడ్వాన్స్‌డ్'కు 21 కేంద్రాలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బి.ఎస్. లత

- అదనపు కలెక్టర్ బి.ఎస్. లత

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 21 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ బి.ఎస్. లత వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సూర్యాపేటలో 8 , తిరుమలగిరిలో ఒకటి, తుంగతుర్తిలో ఒకటి, నెమ్మికల్‌లో ఒకటి, కోదాడలో 5, నడిగూడెంలో ఒకటి, హుజూర్ నగర్‌లో రెండు, నేరేడుచర్లలో ఒకటి, మఠంపల్లిలో ఒకటి చొప్పున మొత్తం 21 కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఈనెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సర పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నిరంతరం విద్యుత్, తాగు నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఐఈఓ కృష్ణయ్య, సెక్షన్ పర్యవేక్షకుడు పద్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు

భానుపురి (సూర్యాపేట) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతు ప్రకటిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి తెలిపారు. సోమవారం సూర్యాపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

నీటి ప్రవాహానికి రాళ్లు అడ్డు





ఎడమ కాల్వ అప్రోచ్ కెనాల్ ఇరువైపులా కూలిన దరులు, ఎడమ కాల్వలో నీటికి అడ్డుగా ఉన్న రాళ్లు

- ఎడమకాల్వపై పట్టింపులేని అధికారులు, పాలకులు

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో నీటి ప్రవాహం నానాటికీ తగ్గుతోంది. 11 వేల క్యూసెక్కులు ప్రవహించాల్సిన కాల్వలో కనీసం తొమ్మిది, పది వేల క్యూసెక్కులు మాత్రమే ప్రవహిస్తున్నాయి. ఎడమకాల్వపై ఏర్పాటు చేసిన గేజీమీటర్ మాత్రం 13 వేల క్యూసెక్కులు చూపిస్తుంది. కానీ అంత నీరు విడుదలైన దాఖలాలు లేవు. ఇందుకు కారణం ఎడమకాల్వ టన్నెల్ ముందుభాగంలో, అప్రోచ్ కెనాల్‌లో ఉన్న రాళ్లేనని రైతులు పేర్కొంటున్నారు. ఆ రాళ్లను తొలగించి, కాల్వకు లైనింగ్ చేయాలని ప్రాజెక్టు అధికారులుగానీ, పాలకులు ఆలోచన చేయడం లేదని అంటున్నారు.

తూము వద్ద పెద్దపెద్ద రాళ్లు..
సాగర్ వద్ద ఎడమ కాల్వ తూము ముందు ఇరువైపుల రాతి దరులు ఉన్నాయి. కాల్వ వెంట చెట్లు పెరిగి వేర్లు లావైనప్పుడు ఆ దరుల రాళ్లు కాల్వలోకి కూలిపోతున్నాయి. చిన్న రాళ్లు టన్నెల్‌లోకి కొట్టుకుపోతుండగా.. పెద్ద రాళ్లు కాల్వలో ఉండి నీటి ప్రవాహానికి అడ్డుగా మారుతున్నాయి. అలాగే జలాశయం లోపల గల అప్రోచ్ కెనాల్‌లో చేపలు పట్టేవారు నాటు బాంబులు వేయడంతో కాల్వ దరులు అదిరి బండలు కాల్వలో పడుతున్నాయి. పదేళ్ల క్రితం టన్నెల్ ముందుభాగం, టన్నెల్ లోపల ఉన్న రాళ్లను తొలగించారు. కానీ కాల్వకు లైనింగ్ చేయలేదు. దీంతో మధ్య కాలంలో రాళ్లు భారీగా కాల్వలో పడ్డాయి. ఇక, అప్రోచ్ కెనాల్‌లో ఇప్పటి వరకు రాళ్లను తొలగించలేదు. దీంతో నీటి ప్రవాహం తగ్గుతోందని రైతులు పేర్కొంటున్నారు.

రాళ్ల తొలగింపునకు ఇదే సరైన సమయం..
సాగర్ జలాశయం ప్రస్తుతం అడుగంటి ఉండటంతో అప్రోచ్ కెనాల్ తేలింది. దానితోపాటు తూము ముందల గల కాల్వలో పడిన రాళ్లను కూడా తొలగించడానికి ఇదే సరైన సమయమని రైతులు చెబుతున్నారు. కాల్వ దరులకు డ్రిల్లింగ్ చేసి ఐరన్ రాడ్లను అమర్చి కాంక్రీట్ చేస్తే చాలాకాలం కాల్వలోకి రాళ్లు పడకుండా ఉంటాయని రిటైర్డ్ ఇంజనీర్లు చెబుతున్నారు.

మరో ఏడు రకాల వైద్యసేవలు

- పీహెచ్‌సీల్లో త్వరలో అందుబాటులోకి..
- విడతల వారీగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఎంపిక
- కసరత్తు చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ
- ఇప్పటికే అందుతున్న ఐదు రకాల సేవలు

తిరుమలగిరి (తుంగతుర్తి): జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. దీనికి సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. పీహెచ్‌సీల్లో ఇప్పటికే ఉన్న ఐదు రకాల సాధారణ సేవలకు తోడు మరో ఏడు రకాల ప్రత్యేక సేవలు అందించనున్నారు. ప్రత్యేక వైద్య నిపుణులతో ఆయా కేంద్రాల వైద్యాధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. త్వరలో ఈ సేవలు ప్రారంభించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.



శిక్షణలో పాల్గొన్న వైద్యాధికారులు (ఫైల్)

ప్రత్యేక సేవలు ఇవే..
ఈఎన్‌టీ, ఆప్తాలమిక్, డెంటల్, మానసిక, శారీరక (పాలియేటివ్ కేర్), 65 ఏళ్లు దాటిన వారికి ఎనర్జీ హెల్త్ కేర్, ఎన్‌సీడీ సేవలు మొదటి విడతలో అందుబాటులోకి రానున్నాయి. వీటిపై వైద్యులకు ప్రత్యేక నిపుణులు శిక్షణ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించారు. రెండో విడతలో కొన్ని, మూడో విడతలో మరికొన్ని కేంద్రాల్లో ఈ సేవలు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.

12 రకాల సేవలు అందుతాయి



ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల్లో విడతల వారీగా ప్రత్యేక సేవలు అందిస్తాం. ఇప్పటికీ ఐదు రకాల సేవలు అందిస్తున్నాం. ప్రత్యేక సేవలను కలుపుకొని ఆరోగ్య కేంద్రాల్లో ఇకనుంచి 12 రకాల సేవలు అందుబాటులోకి వస్తాయి.
– కోటాచలం, డీఎంహెచ్‌ఓ, సూర్యాపేట

తప్పనున్న వ్యయప్రయాసలు
జిల్లాలో 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 యూపీహెచ్‌సీలు, 5 బస్తీ దవాఖానాలు, 20 ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా కేంద్రాల్లో మాతా, శిశు సంరక్షణ టీకాలు, కుటుంబ నియంత్రణ, సిజేరియన్లు, సాధారణ వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. నేషనల్ ప్రోగ్రాం ఫర్ నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్‌లో భాగంగా ఇక నుంచి ప్రత్యేక సేవలను సైతం అందించనున్నారు. ప్రత్యేక వైద్యసేవలు అందుబాటులోకి వస్తే బాధితులు దూర ప్రాంతాల్లో ఉన్న పెద్దాస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. వారికి వ్యయ, ప్రయాసలు కూడా తప్పనున్నాయి.

మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటెయ్యాలి

సూర్యాపేట : వరంగల్- ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షులు గాలిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం సూర్యాపేట పట్టణంలోని ట్యాంక్‌బండ్‌పై వాకర్స్ పట్టభద్రులకు అవగాహన కల్పించి మాట్లాడారు. మల్లన్నకు వేసే ప్రతి ఓటు సమాజానికి ఉపయోగపడుతుందని, కోవిడ్ సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తి మల్లన్న అని గుర్తు చేశారు. పట్టభద్రులు ఆలోచించి సమాజానికి ఉపయోగపడే ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, కార్యదర్శి ఉపేందర్, గౌరవ అధ్యక్షుడు కోడి వెంకటయ్య, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, ఆచారి, ఆంజనేయులు, రామునాయక్ పాల్గొన్నారు.



సూర్యాపేటలో ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

ఘనంగా పరమపద ఉత్సవాలు

మఠంపల్లి : మట్టపల్లి లోని శ్రీలక్ష్మీనరసింహస్వామి మహాక్షేత్రంలో స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా పరమపద ఉత్సవాలను సోమవారం శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, నిత్య అగ్నిహోత్రి, పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చలు గావించారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహా నివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు తూమాటి కృష్ణమాచార్యులు, బదరీనారాయణచార్యులు, అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనర్సింహమూర్తి, ఆంజనేయచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యూరియా అమ్మలేం..!

- వ్యవసాయ, సహకార శాఖలకు డీసీఎంఎస్ లేఖ
- ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు భరించాలని మార్క్‌ఫెడ్ నుంచి ఆదేశాలు
- అలా అయితే ఎంఆర్‌పీకి విక్రయించడం అసాధ్యం..
- నష్టాలు భరించలేమని స్పష్టం చేసిన డీసీఎంఎస్

నల్లగొండ అగ్రికల్చర్ : నష్టాలు భరించి యూరియా విక్రయించలేమని.. జిల్లా నాగార్జున సహకార మార్కెటింగ్ సంఘం (ఎన్‌డీసీఎంఎస్) తేల్చి చెప్పింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ, జిల్లా సహకార శాఖ అధికారులకు డీసీఎంఎస్ అధికారులు లేఖలు రాశారు. గత యాసంగి సీజన్ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక సహకార సంఘాలతో పాటుగా ఎన్‌డీసీఎంఎస్‌కు యూరియా సరఫరా చేసే విషయంలో లారీల ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను రాష్ట్ర మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) భరించేది. దీంతో ఆయా సహకార సంఘాలతో పాటు డీసీఎంఎస్‌లో కూడా యూరియా ఎంఆర్‌పీ ధరకు రైతులకు విక్రయించేవారు. కానీ, ప్రస్తుతం వానాకాలం నుంచి మార్క్‌ఫెడ్ బ్రాంచీల ద్వారా యూరియా సరఫరాకు ప్రాథమిక సహకార సంఘాల వారు ఎలాంటి ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను భరించాల్సిన అవసరం లేదని, డీసీఎంఎస్ మాత్రం ఖచ్చితంగా లారీల ట్రాన్స్‌ఫోర్ట్ చార్జీలను భరించాల్సిందేనని మౌఖికంగా ఆదేశాలను జారీ చేసినట్లు తెలిసింది. దీనివల్ల రైతులపై అదనపు భారం మోపాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.



డీసీఎంఎస్ కార్యాలయం

ఎక్కువ రేటుకు అమ్మలేం..
యూరియా ట్రాన్స్‌పోర్ట్ చార్జీ ఒక్కో లారీకి రూ.5 వేల వరకు ఉంటుంది. దాంతో పాటు యూరియా దిగుమతి కోసం హమాలీలకు రూ.4,160 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు లేని సమయంలో ఒక్కో బ్యాగు యూరియాను (ఎంఆర్‌పీకి) రూ.267 రైతులకు విక్రయించేవారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ పెట్టిన ట్రాన్స్‌పోర్ట్ భారం వల్ల ఒక్కో బస్తాపై రూ.12 అదనపు భారం పడనుంది. దీనివల్ల ఒక్కో బస్తాను రూ.297లకు అమ్మాల్సి ఉంటుంది. కానీ బహిరంగ మార్కెట్‌లో, ఎరువుల దుకాణాల్లో ఎంఆర్‌పీకే అమ్ముతుంటే డీసీఎంఎస్‌లో ఎక్కువ ధరకు ఎలా విక్రయించాలని, ఒకవేళ విక్రయించినా రైతులు కొనుగోలు చేసే పరిస్థితి ఉండదని డీసీఎంఎస్ అధికారులు పేర్కొంటున్నారు. ఎక్కువ ధరకు అమ్మితే ప్రభుత్వానికి, డీసీఎంఎస్‌కు చెడ్డపేరు వచ్చే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు భరిస్తేనే అమ్ముతాం



ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు భరించి.. యూరియాను ఎంఆర్‌పీ ధరకు విక్రయిస్తే నష్టాలు వస్తాయి. డీసీఎంఎస్ నష్టాలను భరించే స్థితిలో లేదు. ఎక్కువ ధరకు అమ్మితే రైతులు కొనుగోలు చేయరు. రైతులు ఆందోళన చేస్తారు. ప్రభుత్వం కూడా ఎక్కువ ధరకు అమ్మితే సహించదు. ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను మినహాయిస్తేనే యూరియా అమ్ముతాం. లేదంటే మానేస్తాం.
– నాగిళ్ల మురళి, బిజినెస్ మేనేజర్, డీసీఎంఎస్

ప్రతి సీజన్‌లో వంద లారీల యూరియా విక్రయం
జిల్లాలోని నల్లగొండ, నార్కట్‌పల్లి, కనగల్, తిప్పర్తి, గుర్రంపోడు, మునుగోడు మండలాలతో పాటు ఇతర ప్రాంతాల రైతులు డీసీఎంఎస్ నుంచి యూరియా కొనుగోలు చేస్తుంటారు. ప్రతి సీజన్‌లో డీసీఎంఎస్ ద్వారా సుమారు 100 లారీల యూరియాను రైతులకు అమ్ముతుంటారు. ఇప్పుడు రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎంఆర్‌పీకియూరియా అమ్మితే డీసీఎంఎస్ తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుందని, అందుకే ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను మార్క్‌ఫెడ్ భరిస్తేనే యూరియా విక్రయిస్తామని.. లేదంటే అమ్మలేమని డీసీఎంఎస్ చేతులెత్తేసింది. ఈ విషయమై డీసీఎంఎస్ అధికారులు రాష్ట్ర మార్కెటింగ్ ఫెడరేషన్, జిల్లా వ్యవసాయ, సహకార శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై ఆయా శాఖలు అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


అఖిల్ (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన ఆత్మకూర్(ఎస్)మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన వరికుప్పల కనకయ్య, అతడి కుమారుడు వరికుప్పల అఖిల్(19) కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం అదే గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ బావి పూడిక తీసేందుకు వెళ్లారు. పూడిక తీసేందుకు ఉపయోగించే క్రేన్‌పై అఖిల్ నిల్చొని ఉండగా.. దానికి విద్యుత్ సరఫరా కావడంతో అఖిల్‌కు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి కనకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

ఎప్‌సెట్ ర్యాంకు రాలేదని విద్యార్థి ఆత్మహత్య

కనగల్: ఎప్‌సెట్ ర్యాంకు రాలేదని ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రానికి చెందిన నర్సింగ్ సత్తయ్య, కృష్ణవేణిల కుమారుడు నితిన్‌గౌడ్ (18) ఎప్‌సెట్ పరీక్ష రాయగా అందులో ర్యాంకు రాలేదని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. నితిన్‌గౌడ్ ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రపోయాక బెడ్ రూమ్‌లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

అనారోగ్యంతో వృద్ధుడు బలవన్మరణం

అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కనగల్ మండలం జీ.ఎడవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లింగాలగూడెంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ బొడిగ రామకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జీ.ఎడవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లింగాలగూడేనికి చెందిన మెండు రామచంద్రారెడ్డి (85) అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు నర్సిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నృసింహుడి జయంత్యుత్సవాలు

- స్వస్తీ వాచనంతో ఉత్సవాలకు శ్రీకారం
- వైభవంగా తిరువేంకటపతి అలంకార సేవ
- రాత్రి పరవాసుదేవుడిగా భక్తులకు దర్శనం


తిరువేంకటపతి అలంకారంలో ఊరేగుతున్న నృసింహుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి క్షేత్రంతోపాటు అనుబంధ ఆలయమైన పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీనృసింహ స్వామి జయంతి ఉత్సవాలను సోమవారం ఆలయ అర్చకులు, వేద పండితులు పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ప్రారంభించారు. ఉదయం ఆలయ ముఖ మండపంలోని ఉత్సవమూర్తుల చెంత స్వస్తీ వాచనంతో జయంతి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. దీంట్లో భాగంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, స్వయంభూలకు కంకణాధారణ అనంతరం పూజలు చేపట్టారు. మధ్యాహ్నం యాదాద్రి ముఖ మండపంలో లక్ష కుంకుమార్చన పూజలు జరిపించారు. తర్వాత స్వామివారిని తిరువేంకటపతిగా అలంకరించి తిరు, మాఢవీధుల్లో సేవను వైభవంగా ఊరేగించారు. సాయంత్రం నిత్య సామూహిక పారాయణములు, అంకురారోపణం, హవనం నిర్వహించారు. రాత్రి శ్రీస్వామి వారిని పరవాసుదేవుడిగా అలంకరించి గరుడ వాహనంపై ఊరేగించారు. ఈ వేడుకల్లో ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతగుట్టలో..

పాతగుట్ట ఆలయంలోనూ సోమవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు ప్రారంభించారు. ఉదయం స్వస్తీ వాచనం, విశ్వక్సేన ఆరాధన, రక్షా బంధనం, లక్ష కుంకుమార్చన జరిపించారు. సాయంత్రం మృత్స్యంగ్రహణం, అంకురారోపణ, హవనం నిర్వహించారు.


లక్ష కుంకుమార్చన పూజ చేస్తున్న అర్చకులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలను అధికారులు ప్రారంభించారు. ఉదయం శ్రీవీరప్రతాప భజన మండలి యాదగిరిగుట్టచే భజన చేపట్టారు. సాయంత్రం తోరణాల పద్మజ బృందం, మంద శ్రీనివాస్ బృందంచే భక్తి సంగీతం, కనకదుర్గ నృత్య విభావరిచే భరతనాట్యం, యుక్తారెడ్డి బృందం, ప్రణుతి ఆదర్శిని బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. భక్తుల సౌకర్యార్థం ఆలయ సన్నిధిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.


భక్తి సంగీతం కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

రేషన్ బియ్యం దందా.. 8మంది అరెస్ట్

- 600 క్వింటాళ్ల బియ్యం సీజ్
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ క్రైం: జిల్లాలోని పలు రైస్ మిల్లుల నిర్వాహకులు ప్రభుత్వ గోదాం నుంచి రేషన్ బియ్యాన్ని నేరుగా మిల్లులకు తరలించి వాటిని ఇతర బ్యాగుల్లోకి మార్చి తిరిగి అవే బియ్యాన్ని ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యంగా సరఫరా చేస్తున్నారని నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. ఈ దందా కొనసాగిస్తున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేయడంతో పాటు 600 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసు వివరాలను సోమవారం ఏఎస్పీ రాములునాయక్‌తో కలిసి ఎస్పీ నల్లగొండలోని తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలంలోని తెప్పలమడుగు గ్రామ స్టేజీ వద్ద గల అమ్మ రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్, పెద్దవూర పోలీస్ స్టేషన్ సిబ్బంది మిల్లులో తనిఖీలు చేయగా.. 600 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. ఐకేపీ సెంటర్ ద్వారా ప్రభుత్వ గుర్తింపు పొందిన రైస్ మిల్లులకు ధాన్యం సరఫరా చేసి, ఆ ధాన్యాన్ని బియ్యంగా మార్చి వేర్‌హౌజ్ కార్పొరేషన్ స్టేజ్-1 గోదాంలోకి సప్లయ్ చేస్తారు. ఈ గోదాం నుంచి మండలస్థాయి స్టాక్ పాయింట్‌కు పీడీఎస్ బియ్యం పంపి అక్కడ నుంచి గ్రామాల్లోని రేషన్ డీలర్లకు సరఫరా చేస్తారు. బియ్యం సరఫరా సమయంలో లారీలకు జీపీఎస్‌తో పాటు ట్రక్ రసీదులు డీలర్‌కు అందజేస్తారు. డీలర్ నుంచి లబ్ధిదారులు బియ్యం తీసుకోవాల్సి ఉంటుంది. కొందరు డీలర్లు లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా డబ్బులు, ఇతర వస్తువులు ఇచ్చి బియ్యాన్ని తమ వద్దనే నిల్వ చేసుకుంటున్నారు. డీలర్లు మండలస్థాయి స్టాక్ పాయింట్ వద్ద నుంచి ప్రతినెలా తీసుకోవాల్సిన బియ్యంలో తక్కువ తీసుకొని కాగితాలపై మాత్రం మొత్తం తీసుకున్నట్లు రాయించి డబ్బులు తీసుకుంటున్నారు. మండలస్థాయి స్టాక్ పాయింట్ వారు కూడా వేర్‌హౌజ్ కార్పొరేషన్ గోదాం నుంచి బియ్యాన్ని తీసుకోకుండా కాగితాలపై తీసుకున్నట్లు రాయించి డబ్బులు తీసుకుంటున్నట్లు గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. వేర్‌హౌజ్ కార్పొరేషన్ గోదాంలో పనిచేస్తున్న కొందరు అక్రమార్కులు రైస్ మిల్లర్లతో కుమ్మక్కై ప్రభుత్వ గోదాం నుంచి రేషన్ బియ్యాన్ని నేరుగా ఇతర మిల్లులకు తరలిస్తున్నారని, వాటిని మిల్లర్లు ఇతర బ్యాగుల్లో ప్యాక్ చేసి తిరిగి అవే బియ్యాన్ని ప్రభుత్వానికి సీఎంఆర్ రైస్‌గా సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ బియ్యాన్ని ఏపీలోని కాకినాడ పోర్టు ద్వారా ఇతర ప్రాంతాలకు పంపిణీ చేస్తున్నట్లు గుర్తించామని ఎస్పీ తెలిపారు.

అరెస్టయ్యింది వీరే..

ఈ దందాకు సంబంధించి ఇప్పటివరకు ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. అమ్మ రైస్ మిల్లు యజమాని మల్గిరెడ్డి రామానుజరెడ్డి, అనుముల మండలం హాలియాకు చెందిన సివిల్ సప్లయ్ స్టేజ్-2 కాంట్రాక్టర్ బూరుగు శ్రీనివాసులు, హాలియాలోని హనుమాన్ రెసిడెన్సీ కాలనీకి చెందిన కుక్కడపు రమేష్, నల్లగొండ పట్టణ సమీపంలోని మర్రిగూడకు చెందిన పేర్ల శ్రీకాంత్, అదే గ్రామానికి చెందిన లింగాల మల్లేష్, పెద్దవూర మండలం తెప్పలమడుగుకు చెందిన వెంపటి సంతోష్‌కుమార్, అదే గ్రామానికి చెందిన లింగంపల్లి సైదులు, హాలియాలోని ప్రతాప్‌నగర్‌కు చెందిన ఎడ్ల ఆంజనేయులును అరెస్ట్ చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. పేద ప్రజల కోసం ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి ప్రభుత్వాన్ని మోసం చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమన్నారు. ప్రభుత్వ పథకాల్లో వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే వారిపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్నీ స్కాములే..

- మాజీ మంత్రి ఈటల రాజేందర్


కోదాడలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కోదాడ రూరల్, హుజూర్‌నగర్: యాభై ఏళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ హయాంలో అన్నీ స్కాములేనని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఆరోపించారు. వరంగల్–ఖమ్మం– నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం కోదాడ పట్టణంలోని ఓ కల్యాణ మండలంలో బీజేపీ జాతీయ నాయకుడు బీబీపాటిల్‌తో కలిసి నిర్వహించిన సన్నాహక సమావేశానికి హాజరయ్యారు. అలాగే ఎన్నికల ప్రచారంలో భాగంగా హుజూర్‌నగర్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెండు చోట్ల ఆయన మాట్లాడుతూ పట్టభద్రులంతా ఈసారి బీజేపీ వైపే ఉన్నారని, ప్రేమేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ ఎన్నికల్లో కూడా తమ పార్టీ అభ్యర్థులం 12 మందికి పైగా గెలుస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని కావడం తథ్యమన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను పట్టించు కోవడంలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్ హామీ తప్ప మిగిలినవి అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో మనుగడ లేని పార్టీ బీఆర్‌ఎస్ పార్టీ అని పేర్కొన్నారు. సమస్యల మీద పోరాటం చేసే పార్టీ బీజేపీ అని అన్నారు. నిరుద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించే శక్తి బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికే ఉందన్నారు. అతనిని ఎమ్మెల్సీగా గెలిపిస్తేనే అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, నాయకులు కనగాల నారాయణ, నూనె సులోచన, కనగాల వెంకట్రామయ్య, బొలిశెట్టి కృష్ణయ్య, అంజియాదవ్, బండారు కవితారెడ్డి, అక్కిరాజు యశ్వంత్, వంగవీటి శ్రీనివాసరావు, శ్రీలతారెడ్డి, బాల వెంకటేశ్వర్లు, అంబళ్ల నరేష్ చింతకుంట్ల సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

వలిగొండ: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వలిగొండ మండల పరిధిలోని నాగారం రైల్వే గేట్ సమీపంలో సోమవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన మదూరి చంద్రశేఖర్‌రావు(58) వలిగొండ మండల పరిధిలోని నాగారం రైల్వే గేట్ సమీపంలో పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహానికి పంచనామా నిర్వహించి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఎవరూ అందుబాటులో లేరని, రైల్వే అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ రజిత తెలిపారు.

బైక్‌పై వెళ్తూ గేదెను ఢీకొట్టి వ్యక్తి మృతి


నాగరాజు (ఫైల్)

గరిడేపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి గేదెను ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన గరిడేపల్లి మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ యాట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండల పరిధిలోని మంగాపురం గ్రామానికి చెందిన పేరబోయిన నాగరాజు(40) ఆది వారం పని నిమిత్తం బైక్‌పై హుజూర్‌నగర్‌కు వెళ్లి తిరిగి రాత్రి స్వగ్రామానికి వెళ్తుండగా.. రాయినిగూడెం శివారులో గేదె అడ్డురావడంతో దానిని ఢీకొట్టి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన నాగరాజును ఖమ్మంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

దళితులను బీజేపీ మోసం చేసింది

- ఏఐసీసీ ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి


మాట్లాడుతున్న కత్తి వెంకటస్వామి

భానుపురి (సూర్యాపేట) : బీజేపీ దళితులను మోసం చేసిందని ఏఐసీసీ ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అయోధ్యలో రాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పలు తప్పులు చేశారని, ఈ తప్పులను ఆ రాముడు కూడా క్షమించడని అన్నారు. దేశంలో మోదీ శకం ముగిసిందన్నారు. జూన్ 4వ తేదీన ఎర్రకోటలో రాహుల్‌గాంధీ ప్రధానిగా బాధ్యతలు చేపడతారని తెలిపారు. ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న)ను అత్యధిక మెజార్టీతో పట్టభద్రులు గెలిపించాలన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీని, దేశంలో బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అంజాద్‌అలీ, తండు శ్రీనివాస్‌యాదవ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి అండగా మంత్రి కోమటిరెడ్డి

- తండ్రిని కోల్పోయిన పిల్లలకు రూ.లక్షన్నర అందజేత
- వారిని తానే చదివిస్తానని మంత్రి భరోసా


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో మాట్లాడుతున్న మమత

మోత్కూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన దేవర శ్రీశైలం కుటుంబానికి తాను అండగా ఉంటానని, శ్రీశైలం పిల్లలను తానే చదివిస్తానని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. శ్రీశైలం భార్య మమత తన పిల్లలతో కలిసి సాయం కోసం సోమవారం హైదరాబాద్‌లోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాసానికి వెళ్లింది. అక్కడే ఉన్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వారిని మంత్రి వద్దకు తీసుకెళ్లి వారి కుటుంబ పరిస్థితి గురించి మంత్రికి వివరించి చెప్పగా ఆయన అండగా ఉంటానని భరోసా కల్పించారు. శ్రీశైలం ముగ్గురు పిల్లలు సానిక్షిత, అంజలి, అజయ్‌కుమార్ ప్రయోజకులయ్యే వరకు తానే చదివిస్తానని మంత్రి చెప్పారు. కుటుంబ పోషణ కోసం తక్షణ సహాయంగా రూ.లక్షన్నర అందజేశారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మమత కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట జిల్లా కాంగ్రెస్ నాయకులు పైళ్ల సోమిరెడ్డి, గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, పట్టణ అధ్యక్షులు గుండగోని రామచంద్రుగౌడ్, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మెంట నగేష్, ఆలకుంట్ల శ్రీను తదితరులు ఉన్నారు.

చాకలిగట్టులో సోలార్ ప్యానల్స్ చోరీ

నాగార్జునసాగర్: సాగర్ జలాశయం మధ్యలో గల చాకలిగట్టులో అటవీశాఖ ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్‌ను చోరీకి గురయ్యాయి. ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చాకలిగట్టులో 11 ఏళ్ల క్రితం కృష్ణజింకలను వదిలారు. వాటి సంరక్షణకు గాను గార్డ్స్‌ను ఏర్పాటు చేశారు. గార్డ్స్ సౌకర్యార్థం రాత్రివేళ వెలుతురు, తాగునీటికోసం మోటారు నడిచేందుకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి విద్యుదుత్పాదన చేసుకుంటున్నారు. మూడు రోజుల క్రితం సోలార్ ప్యానల్స్ అపహరణకు గురైనట్లు అటవీ శాఖ ఉద్యోగులు గుర్తించారు. సుమారుగా 20 వరకు సోలార్ ప్యానల్స్ చోరీకి గురైనట్లు సమాచారం. ఈ విషయంపై నాగార్జునసాగర్ ఫారెస్ట్ రేంజర్ రాఘవేంద్రను వివరణ కోరగా.. చాకలిగట్టుపై ప్యానల్స్ అపహరణకు గురైన విషయం నిజమేనని, విచారణ చేపట్టామని త్వరలో దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

పోచంపల్లి ఇక్కత్ కళ భేష్..


దీపాదాస్ మున్షికి పోచంపల్లి ఇక్కత్ స్కార్ఫ్‌ను చూపిస్తున్న భోగ బాలయ్య దంపతులు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి ఇక్కత్ కళ ఎంతో బేషుగ్గా ఉందని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి అన్నారు. సోమవారం పోచంపల్లికి చెందిన చేనేత కళాకారుడు భోగ బాలయ్య-సరస్వతి దంపతులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు. మగ్గంపై డబుల్ ఇక్కత్ విధానంలో తయారు చేసిన 10 వేల షేడ్స్ రంగుల మధ్యన ఇండియా మ్యాప్ కలిగిన స్కార్ఫ్‌ను చూపించారు. ఇక్కత్ స్కార్ఫ్‌ను చూసిన ఆమె.. బాలయ్య దంపతులను ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న స్పీకర్


ఆలయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, స్నేహితులు, నేతలు

యాదగిరిగుట్ట: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సోమవారం యాదాద్రీశుడిని దర్శించుకున్నారు. గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యాదాద్రి ఆలయం గొప్ప దేవాలయమని, శ్రీలక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర ప్రజలంతా ఎంతో భక్తితో కొలుస్తారని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పుడు ఏమీ మిగలకుండా ఖజానా ఖాళీ చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి యాదాద్రీశుడు మనోధైర్యం ఇవ్వాలని, రాష్ట్ర ప్రజలు, రైతులు సుఖ సంతోషంగా ఉండాలని లక్ష్మీనరసింహుడిని కోరుకున్నట్లు ఆయన వెల్లడించారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గుర్రంపోడు: మండలంలోని తానేదార్‌పల్లి గ్రామంలో రెండు ఇళ్లలో నిల్వ ఉంచిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి పట్టుకున్నట్లు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సివిల్ సప్లయ్ సీఐ గౌస్ తెలిపారు. తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన గార్లపాటి వెంకటేశ్వర్లు, గార్లపాటి మల్లికార్జున్ రేషన్ లబ్ధిదారుల నుంచి సేకరించిన రేషన్ బియ్యంను తమ ఇళ్లలో 20 క్వింటాళ్ల చొప్పున మొత్తం 40 క్వింటాళ్ల(80 బస్తాలు) నిల్వ చేయగా.. స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరు రేషన్ బియ్యాన్ని నాంపల్లిలో స్వామి అనే వ్యక్తికి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇరువురిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ బి. శివప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హబీబ్, కానిస్టేబుళ్లు వెంకట్‌రెడ్డి, హమీద్ పాల్గొన్నారు.

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త


జ్యోతి (ఫైల్)

రామగిరి(నల్లగొండ): అనుమానంతో భార్యను భర్త హత్య చేశాడు. ఈ ఘటన తిప్పర్తి మండలంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ డి. రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం నూకలవారిగూడేనికి చెందిన గుండెబోయిన నాగరాజుకు 2001లో గుర్రంపోడు మండలం కొప్పోలుకు చెందిన జ్యోతి(40)తో వివాహం అయ్యింది. వ్యవసాయం చేస్తున్న నాగరాజు మద్యానికి బానిసై భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఇదే విషయమై వీరి మధ్య తరచూ గొడవ జరిగేది. ఆదివారం మధ్యాహ్నం గేదెలను తోలుకొని జ్యోతి ఊరి చివరకు వెళ్లింది. అనుమానంతో భార్యను వెంబడించిన నాగరాజు గొడవకు దిగి కోపంతో జ్యోతి తలపై విచక్షణారహితంగా మోదాడు. దీంతో స్పృహ తప్పిన జ్యోతిని ఇంటికి తీసుకొచ్చాడు. స్పృహ తప్పి పడిపోయిందని చుట్టుపక్కల వారికి చెప్పి అంబులెన్స్‌లో నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. జ్యోతి తలపై గాయాలను చూసిన ఆమె తండ్రి భైరవోని స్వామి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. ఈ మేరకు హత్య కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం పోస్టుమార్టం చేసి జ్యోతి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నెల్లిబండ గట్టు జాతర ప్రారంభం

- ఓ లింగా.. ఓ లింగా నామస్మరణతో మార్మోగిన గట్టు
- భారీగా తరలివచ్చిన భక్తులు


జాతరకు తరలివచ్చిన భక్త జనం

నకిరేకల్: ఓ లింగా.. ఓ లింగా.. నామస్మరణతో నెల్లిబండ గట్టు మార్మోగింది. నకిరేకల్ మండల పరిధిలోని నెల్లిబండ గ్రామంలో గల గట్టు మీద ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే శ్రీలింగమంతుల స్వామి, సౌడమ్మ జాతర సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆదివారం రాత్రి నెల్లిబండ గ్రామంలోని మిద్దెగూడెం నుంచి దేవరను నెల్లిబండ గట్టు మీదికి తీసుకురావడంతో జాతరకు శ్రీకారం చుట్టారు. జాతర సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ జాతరకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం ఉదయం గ్రామ ప్రజలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గట్టుపై ఉన్న లింగమంతులస్వామి, సౌడమ్మ అమ్మవార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కుంకుమార్చన, కంకణధారణ వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆకుమంచమ్మ బోనం తీశారు. భక్తులు యాటలను బలి ఇచ్చారు. జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే పూజలు..


స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

లింగమంతులస్వామి జాతరకు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై గుట్ట మీద స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే జాతర వరకు నెల్లిబండ గుట్ట పైకి సీసీ రోడ్డు నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ పూజల్లో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ యానాల యాదగిరెడ్డి, ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవీగంగాధర్‌రావు, మాజీ ఎంపీపీ చామల శ్రీనివాస్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నేతలు గాజుల సుకన్య, పన్నాల రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీ యానాల శేఖర్‌రెడ్డి, ఆలయ డైరెక్టర్లు బాత్క లింగస్వామి, ఆడెపు సతీష్, బొయ్యిళ్ల అశ్విన్, గుడుగుంట్ల శివశంకర్, వీరబోయిన అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.